Whatsapp No: 9440662699

www.rajadhanivartalu.com  facebook.com/rajadhaniv

RNI No. APTEL 2015/ 66622





# రాజధాని వార్తలు

Voice of Voiceless






అమరావతి సంపుటి : 2 సంచిక 41, పేజీలు 8 రూ. 2/- ఆంధ్రప్రదేశ్ ' రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 3- ఆదివారం 9, జూలై 2017


## వనం-మనంలో

# 25 కోట్ల మొక్కలు



**రా.వా.ప్రతినిధి-అమరావతి :** వనం మనం కార్యక్రమాన్ని 125 రోజులపాటు నిర్వహించి 25 కోట్ల మొక్కలను రాష్ట్రంలోని 13 జిల్లాలో నాటాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. జూలైలో వన మహోత్సవంతో ప్రారంభించి నవంబరులో వన భోజనాలతో దీనిని ముగించాలన్నారు. ప్రతి శనివారం పాఠశాలల్లో ప్రజారోగ్యంపై చర్చలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 4వ శనివారం ప్రజాచైతన్య యాత్రలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రతినెలా ఆరోగ్య సమాచారాన్ని విడుదల చేయాలని ఆదేశించారు. తన నివాసం నుంచి శుక్రవారం వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహించారు.

పచ్చదనం పరిరక్షణలో భాగంగా 'వనం-మనం' కార్యక్రమాన్ని ప్రభుత్వం ఉద్యమంలా చేపడుతున్నట్లు అటవీశాఖ మంత్రి సిద్ధా రాఘవరావు చెప్పారు. గుంటూరు జిల్లా గ్రామీణ గుంటూరు మండలంలోని ఓబులనాయుడుపాలెం శివారులోని అటవీ భూముల్లో శనివారం సీఎం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు కోటి మొక్కలు నాటేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేసిందన్నారు. ప్రస్తుతం ఇక్కడ 50 ఎకరాల్లో పదివేల మొక్కలు నాటుతున్నట్లు వెల్లడించారు.

సమాచారలోపంవల్లే తూర్పుగోదావరి జిల్లా చాపరాయి మాదిరి సంఘటనలు చోటుచేసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సకాలంలో ప్రభుత్వ సేవలు అందకపోవడం, 16 మంది మరణించడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ తరహా సంఘటనలు పునరావృతం కాకూడదన్నారు. అంటువ్యాధుల నియంత్రణకు గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, వైద్య ఆరోగ్యశాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. శనివారం నుంచి నిర్వహించే దోమలపై దండయాత్రలో తాగునీటి వనరుల శుభ్రం, పారిశుధ్యం మెరుగుదల, మొక్కలు నాటడం వంటి పనులను ముమ్మరం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. నోడల్ అధికారులను నియమించాలని, అన్ని శాఖల అధికారులను సమన్వయంతో కృషి చేయాలన్నారు.

### చంద్రబాబుతో రామసుబ్బారెడ్డి భేటీ

**అమరావతి :** టీడీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాజీమంత్రి రామసుబ్బారెడ్డి శనివారమిక్కడ భేటీ అయ్యారు. కాగా గత కొంతకాలంగా రామసుబ్బారెడ్డి అధిష్టానంపై అసంతృప్తిగా ఉన్న విషయం తెలిసిందే. వైఎస్ఆర్ సీపీ నుంచి గెలిచి అనంతరం పార్టీ ఫిరాయించిన ఆదినారాయణరెడ్డిని టీడీపీలో తీసుకోవడంతో పాటు, ఆయనకు మంత్రి పదవి ఇవ్వడంపై రామసుబ్బారెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు కూడా. దీంతో ఆయన ఇటీవల విశాఖలో జరిగిన టీడీపీ మహానాడుకు సైతం గైర్హాజరు అయ్యారు. ఈ నేపథ్యంలో రామసుబ్బారెడ్డి సమావేశంపై ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఇది అసలైన జీఎస్టీ కానే కాదు : చిదంబరం



**న్యూఢిల్లీ:** వస్తు సేవా పన్ను (జీఎస్టీ)పన్నుపై కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి పి.చిదంబరం పెదవి విరిచారు. అది అసలైన జీఎస్టీ కాదని అన్నారు. నిపుణులు తయారు చేసి ఇచ్చిన ముసాయిదా ప్రకారం ఈ జీఎస్టీ లేదని, కచ్చితంగా ద్రవ్యోల్బణంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపిస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా దీనివల్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వర్తకులంతా కూడా పెద్ద మొత్తంలో నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక సంస్కరణగా పేర్కొంటూ దేశ వ్యాప్తంగా ఒకే పన్ను విధానం ఉండేలాగా వస్తు సేవా పన్నును శుక్రవారం అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీతో సహా విపక్షాలన్నీ డుమ్మా కొట్టాయి. ఈ నేపథ్యంలో శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన గతంలో బీజేపీనే స్వయంగా జీఎస్టీని వద్దని చెప్పిందన్న విషయం అందరికీ తెలుసని, దీనిని ఎవరూ కాదన లేరని గుర్తు చేశారు. భారత దేశంలో జీఎస్టీ అమలు సాధ్యం కాదని కూడా బీజేపీనే ఆరోపించి గతంలో అడ్డుకుందని అన్నారు.

## ప్రపంచ స్థాయి రాజధాని నిర్మిస్తాం : అనంత



గుంటూరు జిల్లా ప్లీనరీలో వేదికపై వైఎస్సార్‌సీపీ నాయకులు, (ఇన్‌సెట్‌లో) లావు కృష్ణదేవరాయులు

**రా.వా. ప్రతినిధి,గుంటూరు :** జగన్ ప్రభుత్వం వచ్చాక అంతర్జాతీయ రాజధాని నిర్మాణం జగన్ ఆధ్వర్యంలో జరుగుతుందని, వైసీపీ రాజధాని నిర్మాణంలో ఎలాంటి అడ్డంకులు కల్పించలేదని వైఎస్సార్ నాయకుడు మాజీ ఎం.పి. అనంత వెంకట రామి రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా పార్టీ ప్లీనరీలో ఆయన మాట్లాడుతూ తమ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి రాజధాని ప్రాంతం ప్రకటనకు ఆమోదం తెలిపారు. వైసీపీ రాజధాని అమరావతి నిర్మాణంలో అడ్డంకులు పెడుతున్నామనటం సరికాదని, రాజధానిలోని రైతులు, రైతుకూలీలకు పనులు లేక పోవటం,ప్రజలకు పనులు లేకపోవటం వారిని ప్రభుత్వం పట్టించుకోక పోవటాన్ని తాము వ్యతిరేకమన్నారు. విశాఖలో జరుగుతున్న భూముల కుంభకోణాలపై తమ ప్రభుత్వం ఏర్పడిన తరువాత విచారణ జరిపి నిందులను శిక్షిస్తామని సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ తెలిపారు. సీనియర్ నేత అంబటి రాంబాబు

- మిగతా 2 లో

## ఎంపీలు సెల్ఫీలతో బిజి.. సామాన్యుడు గజిబిజి

**న్యూఢిల్లీ:** బీజేపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ప్రవేశ పెట్టిన జీఎస్టీకి హాజరైన ఎంపీలు, మంత్రులు ఆనందంగా ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, ప్రధాని మోడీ ప్రసంగాలకు ఆనందంతో చప్పట్లు కొట్టగా, టీవీల ముందుకూర్చున్న మధ్యతరగతి వర్గాలు, చిన్నవ్యాపారులు మాత్రం జీఎస్టీ అమలు పట్ల గజిబిజికి లోనయ్యారు. 'ఒకే దేశం - ఒకే పన్ను' జీఎస్టీ విధానం జూలై 1నుంచి అమలు లోకి వచ్చింది. రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, ప్రధాని నరేంద్ర మోడీ ఢంకా మోగించి ఈ కొత్త వ్యవస్థకు స్వాగతం పలికారు. పార్లమెంట్‌లో నిర్వహించిన ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని పలువురు ఎంపీలు తమ ఫోన్లతో పదిలపరచుకున్నారు. వారంతా సహచరులతో కలిసి సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. జీఎస్టీ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగే సమయంలో బాలీవుడ్ తార, ఎంపీ హేమమాలినితో పాటు పలువురు ఎంపీలు తమ సెల్‌ఫోన్లకు పని చెప్పారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో

- మిగతా 2 లో

## జీఎస్టీతో రాష్ట్రానికి రాబడి తగ్గదు

**రా.వా.ప్రతినిధి,అమరావతి:** రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చే ప్రధాన విభాగాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలోనే ఉండటంతో రాష్ట్ర ఆదాయానికి గండపడదని తెలుస్తోంది. మద్యం, పెట్రోలియం ఉత్పత్తుల్ని జీఎస్టీ పరిధిలోకి తీసుకురాక పోవడంతో సుమారు రూ.18 వేల నుంచి రూ.20 వేల కోట్ల ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి చేకూరుతుంది. మద్యం, పెట్రో ఉత్పత్తులపై మినహా మిగిలిన వాణిజ్య పన్నులను జీఎస్టీ పరిధిలోకి తెచ్చారు. వీటిపై అజమాయిషీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంయుక్తంగా ఉంటుంది. ఏయే విభాగాలపై పన్నుల వసూలు ఎవరి ఆధ్వర్యంలో ఉంటుందన్నది కొద్దిరోజుల్లో తేలనుంది. ఇతర ఆదాయ మార్గాలైన రవాణా, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, ఖనిజాలు, అటవీ ఉత్పత్తులు, ల్యాండ్ రెవెన్యూ తదితరాలు యదావిధిగా రాష్ట్ర ప్రభుత్వ ఆజమాయిషీలోనే ఉంటాయి. 2016-17లో వాణిజ్య పన్నుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.33,566 కోట్ల ఆదాయం

- మిగతా 2 లో







రాజధాని వార్తలు కలం

## వనమహోత్సవం

# ఒక వృధాప్రయాస


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతీది ఆర్భాటంగా చేయడం ఆనవాయితీగా మారింది. ఏదో చేసేస్తున్నాం అని ప్రజలను నమ్మించడానికే ఈ అగచాట్లని వేరే చెప్పనక్కర్లేదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం జూలై 1 నుంచి కార్తీక మాసం చివరివరకు వనమహోత్సవాన్ని నిర్వహిస్తోంది. వనాల విస్తీర్ణాన్ని పెంచే లక్ష్యంతో ప్రతి ఏడాది 50 కోట్ల మొక్కలను నాటాలని, దీంతో రాష్ట్రంలో 23 శాతం గా ఉన్న అటవీప్రాంతాన్ని 2029 నాటికి కనీసం 50 శాతానికి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో వనమహోత్సవం ఒక వృధా ప్రయాసే ఎందుకంటారా ఏడాది అంతా అభివృద్ధి, రోడ్లనిర్మాణాల పేరుతో మహావృక్షాలను నేలకు కూల్చి ప్రభుత్వం ఆరునెలల మొక్కలను నాటడం కంటి తుడుపు చర్య మాత్రమే.. ఎన్నోదేశాలు మహావృక్షాలను తొలగించాల్సి వస్తే ఆధునికపద్ధతుల్లో వాటిని మరొక చోటికి తరలించి అక్కడ వాటిని మళ్లీ నాటుతుంటారు. దీంతో ఎటువంటి నష్టమూ వాటిల్లదు. హైటెక్ ముఖ్యమంత్రిగా చెబుతున్న చంద్రబాబు ఇటువంటి ప్రక్రియను ఎందుకు అవలంభించరు. ఇప్పటికే రాజధాని ప్రాంతమంతా పొలాలు, చెట్లు లేకుండా ఎడారిగా మారుతున్న వేళ మళ్లీ వనమహోత్సవం పేరుతో కోట్ల రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారు. ముఖ్యమంత్రి తరిగిపోయిన అటవీప్రాంతాన్ని నెలకొల్పడానికి ఎంతో కృషి చేస్తున్నారని భజనపరులు మీడియాకు తెలపడం ప్రజలను మభ్యపెట్టడానికి మాత్రమే. ప్రతి ఏడాది కనిపించిన చోటల్లా మొక్కలు నాటడం , నాటిన రోజు వాటికి ట్రీగార్డులు ఏర్పాటు, జియో ట్యాగింగ్ అంటూ నానా హంగామా చేయడం ఆపై వేరే కార్యక్రమాలు జరపడంలో నిమగ్నమై మొక్కల పెంపకాన్ని మర్చిపోవడం యధాతదంగా జరుగుతోంది. పోయినేడాది అన్ని ప్రభుత్వ,ఎయిడెడ్ పాఠశాలలకు మొక్కలు సరఫరా చేశారు. వీటని నాటి ప్రతినెలా ఫోటోలు తీసి పంపాలని ఆదేశాలు జారీ చేశారు. రెండు మూడు నెలలపాటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విటిని అమలు చేశారు. ఆపై ఏమయ్యాయో ఎవరికీ తెలియదు. మళ్లీ కార్యక్రమం యధాతదంగా చేపడుతున్నా, ఇదే చరిత్ర పునరావృతం అవడం తప్పించి జరిగేది ఇంకేమీలేదు. నిజానికి ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ప్రహరీగోడలు, ఫెన్సింగ్ వంటివి ఉండవు. ఉన్న కొద్ది కార్యాలయాల్లో పశువులు కూడావచ్చి మొక్కలు తింటుంటాయి. పాఠశాల సెలవు దినాల్లో మొక్కలను పట్టించుకునే వారే ఉండరు. దీంతో ప్రతి ఏడాది నర్సరీలను, కాంట్రాక్టర్లను పోషించడానికి ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేయడమే తప్ప పెట్టిన ఖర్చుకు ప్రయోజనం ఉండటం లేదన్నది అందరికీ తెలిసిన సత్యం. ఈ ఏడాది రాష్ట్రంలోని 13 జిల్లాల్లో కలిపి 9.11కోట్ల మొక్కలను నాటాలని ప్రభుత్వం సంకల్పించింది. ఎన్ని మొక్కలు నాటామన్నది కాదుకదా.. ఎన్ని మొక్కలను రక్షించుకున్నాం.. లేదా పెరిగాయన్నది ముఖ్యం. ప్రతి ఏడాది వీటికి వందలకోట్లు దుబారా చేయడం ఏమత్రం అభిలాషణీయం కాదు. సంకల్పం మంచిదే కావచ్చు, కాని ప్రజా ధనానికి న్యాయం చేకూర్చవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆరు మాసాల వయస్సున్న మొక్కలు 7.27 కోట్లు, రెండేళ్ల పైబడిన మొక్కలు 1.84 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా కృషి చేస్తుంది. అయితే పాలక వర్గం గుర్తు పెట్టుకోవాల్సింది ఏమంటే విచ్చలవిడిగా మహావృక్షాలను తొలగించడాన్ని మానుకోవాలి. ఒకవేళ తొలగించాల్సి వస్తే వాటిని ప్రభుత్వ భూముల్లో నాటేందుకు ఆధునిక సాంకేతికతను అమలులోకి తేవాలి. మొక్కలు నాటడాన్ని ప్రహసనంగా కాకుండా అంకితభావంతో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ముందుకు తీసుకువెళ్లి చిత్తశుద్ధితో చేపట్టాలి. అప్పుడే ప్రజాధనానికి ప్రయోజనం చేకూరి, రాబోయే తరాలు ఆరోగ్యవంతంగా జీవించకలుగుతాయి.

పౌరులు–చట్టాలు

# అవధులు గుర్తుంచుకోవాలి



కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
కన్సల్టింగ్ ఎడిటర్, హైకోర్టు న్యాయవాది
98495 68901/83309 68901
katuruRavindraTrivikram@gmail.com



18 వాక్చాతుర్యం,స్వష్టీకరణల అవధుల మనం గుర్తుంచుకోవాలి అంటే వీటిని సద్వినియోగం చేసుకోవాలి తప్ప దుర్వినియోగం చేయకూడదు. ప్రజల ముందు హుందాగా వ్యవహరించాలి తప్ప 'నేను మాట్లాడిందంతా రైటు, అది నా హక్కు' అనే అతివాదానికి దిగకూడదు. ప్రభుత్వ విధానాల్లోని లోపాలు విమర్శించవచ్చు కానీ, మన శత్రుదేశాలకు, ఉగ్రవాదుల మానవహక్కులకు మద్దతుగా ఎలాంటి వ్యాఖ్యలు, ప్రకటనలు చేసినా అది దుర్వినియోగం క్రిందనే చూస్తారు. ప్రస్తుతం మన దేశంలో ఈ విషయం మీద ఘర్షణాత్మక చర్యలు జరుగుతున్నాయి. నైతిక విలువలు, దేశాభిమానం ప్రతి పౌరుడి ప్రాధమిక కర్తవ్యం. దీనికి మతం, రాజకీయపార్టీ, ఆస్తిక, నాస్తికత్వాలతో సంబంధం లేదు. దేశ వ్యతిరేక ధోరణిని ఎవరూ సహించరు. అందుకే రాజ్యాంగంలోనే స్వేచ్ఛలను బాధ్యతల హద్దులతో అదుపుచేశారు. బాధ్యత ప్రారంభమైనప్పుడు స్వేచ్ఛ అంతరిస్తుంది.

(2) సమావేశాల స్వేచ్ఛ మీద అదుపు : 19(1) అధికరణం పౌరులకు సమావేశాల నిర్వహణ, ఊరేగింపులు చేయడానికి స్వేచ్ఛ నిచ్చింది. అయితే, అవి శాంతియుతంగానే ఉండాలి. ఆయుధాలు ధరించకూడదు.క్రింద నిబంధనలకు అనుగుణంగా మాత్రమే ఈ స్వేచ్ఛను ఉపయోగించాలి.

(ఎ) భారత సార్వభౌమత్వానికి విఘూతం లేకుండా

(బి) శాంతి భద్రతల సమస్య లేకుండా (19(3) అధికరణం)

(3) అసోసియేషన్స్, సంఘాల ఏర్పాటుకి నిబంధనలు : అధికరణం19(1)(సి) క్రింత ప్రతి పౌరుడికీ అసోసియేషన్స్,సంఘాలు ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ ఉంది. ఇవన్నీ ఒకే

ఉద్దేశంతో ఏర్పడి స్వచ్ఛంద సంస్థలు ఈ స్వేచ్ఛ సదరు సంస్థల కొనసాగింపుకి కూడా వర్తిస్తుంది. అయితే, క్రింది నిబంధనలు వర్తిస్తాయి.

(ఎ)భారతదేశ సమగ్రత, సార్వభౌమత్వానికి విఘూతం లేకుండా

(బి) అధికరణం 19(4) లో చెప్పబడిన నైతికత, శాంతిభద్రల పరిరక్షణకు విఘూతం లేకుండా.

(4) భారతదేశంలో ఎక్కడైనా సంచరించే, నివసించే స్వేచ్ఛకి నిబంధనలు : మన దేశంలో వివిధ

రాష్ట్రాలున్నాయి. వాటికి ప్రభుత్వాలున్నాయి అయితే, భారతీయ పౌరుడు స్వేచ్ఛగా ఏ రాష్ట్రంలోనైనా సంచరించవచ్చు, నివసించవచ్చు. ఇందుకు రాజ్యాంగ అధికరణం 19(1)(డి),(ఈ) ద్వారా అవకాశం లభిస్తోంది. ఈస్వేచ్ఛకు ఎలాంటి ప్రతిబంధకాలు లేవు. కానీ, నిబంధనలు ఉన్నాయి.

అవేమిటంటే–ప్రజాబాహుళ్యానికి ఎలాంటి ఇబ్బందులు, అవరోధాలు కలుగరాదు.

అధికరణం19(5) ప్రకారం ఏ షెడ్యూల్‌ట్రైబ్ హక్కులకూ భంగం కల్గించకుండా ఉండాలి.

ఈ నిబంధనలు ఉన్నా కొందరు వీటిని అతిక్రమిస్తునే ఉన్నారు. దీంతో శాంతి భద్రతల సమస్యలు ఏర్పడుతున్నాయి అందుకు స్వీయ క్రమశిక్షణా లోపమే కారణం.

(సశేషం)

## రాయపూడిలో 'దోమలపై దండయాత్ర'



**రా.వా.ప్రతినిధి, తుళ్లూరు :** రాజధాని ప్రాంతం, మండల పరిధిలోని రాయపూడిలో దోమలపై దండయాత్ర కార్యక్రమం జరిగింది. స్థానిక సర్పంచ్ రెంటపల్లి నాగమణి ఆధ్వర్యంలో దోమల నివారణకు సంబంధించి అవగాహన కల్పించే ప్లే కార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ జరిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, దోమల వ్యాప్తి నిరోధానికి జరిగే కృషిలో గ్రామస్థులందరూ భాగస్వాములు కావాలని ర్యాలీలో పాల్గొన్న పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పిలుపు ఇచ్చారు. ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల్లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రెంటపల్లి నాగమణెమ్మ, వైద్యాధికారులు,శ్రీకృష్ణదేవరాయల ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంబాబు,అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ సెక్రటరీ వెంకటప్పయ్య,సిబ్బంది పాల్గొన్నారు. దోమల నివారణకు మరుగు నీటి తొలగింపు, కాలవల్లో బ్లీచింగ్, ఫెనాయిల్ చల్లించడం లాంటి కార్యక్రమాలు చేశామని పంచాయతీ కార్యదర్శి వెంకటసుబ్బయ్య చెప్పారు.

## రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పరిశీలన

**రా.వా ప్రతినిధి కోనసీమ–జిఎన్.రావ్ :** అమలాపురంలోని ఎర్రవంతెను నుండి నల్లవంతెన వరకు ప్రధాన పంట కాలువను ఆనుకుని రూ.10కోట్ల ఓఎన్‌జీసీ నిధులతో జరగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో కలసి పరిశీలించారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల్లో భాగంగా ఏర్పాటుచేస్తున్న గ్రిల్స్‌ను మంత్రి పరిశీలించారు. ఎర్రవంతెన–నల్లవంతెనల మధ్య జరగుతున్న వంతెన నిర్మాణ పనులను కూడా మంత్రి పరిశీలించారు. ఎర్రవంతెన వద్ద చల్లపల్లికి వెళ్లే రోడ్డులో కాలువకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ చిక్కాల వినాయకరావు, ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ గునిశెట్టి చినబాబు, వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కర్రి రామస్వామి, నిమ్మకాయల జగ్గయ్యనాయుడు, ఆశెట్టి ఆదిబాబు తదితరులు ఉన్నారు.

## ప్రపంచ స్థాయి రాజధాని నిర్మిస్తాం

**(మొదటిపేజీ తరువాయి)**

మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా తెలుగుదేశ ప్రభుత్వం పలు ఆర్థిక కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం సీట్లను సమాజంలో అట్టడుగున వున్నా విద్యార్థులకు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పార్టీ యువనేత లావు కృష్ణదేవరాయులు డిమాండు చేస్తారు. దీంతో పాటుగా గ్రాడ్యుయేట్లను,పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్ల ఫీజులను తగ్గించాలన్నారు. వైఎస్సార్ పార్టీ ప్లీనర్ సమావేశాలు గుంటూరు జిల్లాలో జులై 8 నుంచి రెండు రోజులు జరుగుతాయని జిల్లా అధ్యక్షుడు మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

## ఎంపీలు సెల్ఫీలతో బిజి.. సామాన్యుడు గజిబిజి

**(మొదటిపేజీ తరువాయి)**

నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ ప్రసంగిస్తున్న సమయంలో కేంద్రమంత్రి జయంత్ సిన్హా మోడీని ఫొటోలు తీస్తూ కనిపించారు. పలువురు ఎంపీలు, ప్రముఖులు సెల్ఫీలు దిగుతూ, ఫొటోలకు ఫోజులిస్తూ, వీడియోలు తీస్తూ ఆనందంగా గడిపారు. అధికార ఎంపీలే కాకుండా వివిధ పార్టీలకు చెందిన నేతలు ఈ కార్యక్రమంలో సందడి చేశారు. అయితే టీవీల వద్ద కూర్చున్న మధ్యతరగతి, చిన్నవ్యాపారుల మాత్రం ఆందోళన చెందారు.

## జీఎస్టీతో రాష్ట్రానికి రాబడి తగ్గదు

**(మొదటిపేజీ తరువాయి)**

సమకూరితే, దీనిలో మద్యం, పెట్రోలియం ఉత్పత్తులపై పన్నుల రూపంలో వచ్చిన ఆదాయమే సుమారు రూ.18వేల కోట్లు. ఇతర విభాగాల నుంచి వాణిజ్య పన్నుల రూపంలో వచ్చింది రూ.15,938 కోట్లు. ప్రస్తుతం ఇది జీఎస్‌టీ పరిధిలోకి వెళ్లింది. రాష్ట్రంలో జీఎస్టీ పరిధిలోకి వచ్చే వ్యాపారులు 2.50 లక్షల మంది ఉన్నారు. వీరిలో రూ.కోటిన్నర లోపు టర్నోవరు ఉండే డీలర్లలో 90 శాతం మంది రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోకి, 10శాతం కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వెళతారు. రూ.కోటిన్నర కంటే ఎక్కువ టర్నోవరున్న వ్యాపారులు 50 శాతం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి, 50 శాతం కేంద్రం పరిధిలోకి వెళతారు. రాష్ట్ర ప్రభుత్వం తమ పరిధిలోకి వచ్చే వ్యాపారుల నుంచి వసూలు చేసే పన్నులో సగం కేంద్రానికివ్వాలి. కేంద్ర ప్రభుత్వం కూడా తాము వసూలు చేసే పన్నులో సగం రాష్ట్ర ప్రభుత్వానికివ్వాలి. 2017–18 ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌టీ పరిధిలోకొచ్చే వాటిపై రాష్ట్ర ప్రభుత్వానికొచ్చే ఆదాయం రూ.17,500 కోట్లకు తగ్గకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే, అంతకంటే ఎంత తక్కువ వచ్చినా ఆమొత్తాన్ని కేంద్ర భరిస్తుంది.



**Dr. DWIBHASHYAM KASI VISHWANATH TEJASWI**
B.A.M.S
CHINTALURU AYURVEDA PHARMACY
9032990138/ 9393990138
email:
dr.d.vishwanath@gmail.com

# శీఘ్ర రోగ నివారణకు జపాలు

### ఆరోగ్య ప్రదాత అయిన ధన్వంతరీ స్వామి వారి ప్రార్ధన

నమామి ధన్వంతరి ఆదిదేవం,సురాసురైర్వందిత పాదపద్మంలోకే జరారుగ్భయ మృత్యునాశం,ధాతార మీశం వివిధౌషధీనాయ్॥

మందులు (ఔషధ సేవనం చేయునపుడు). వేసుకునేటప్పుడు ఈ శ్లోకం చదువుతూ వేసుకుంటే అది అమృతంలా పని చేస్తుంది.

శరీరే జజ్జిరీ భూతే వ్యాధిగ్రస్తే కళేబరే
ఔషధం జాహ్నవీతోయం, వైద్యో నారాయణో హరి: ।
ధన్వంతరిం,గరుత్మంతం, ఫణిరాజంచ కౌస్తుభమ్
ఆచ్యుతం,అమృతం, చంద్రం స్మరేద్ ఔషద్ కర్మణి॥

### ఆపదలు తొలగుటకు

ఆపదామపహర్తారం,ధాతారం సర్వసంపదాయ్
లోకాభిరాం శ్రీరాం భూయో, భూయో నమామ్యహం॥
ఆర్తానా మార్తి హంతారం భీతానాం భయనాశనం
ద్విషతాం కాలదండం తం రామచంద్రం నమామ్యహమ్॥

### దారిద్ర్య నివారణకు

దరిద్ర విప్రగేహేయ: శాకాం భర్త్సోతమాం శ్రియం
దదౌద్రే దత్త దేవ: సదారిద్రాత్ శ్రీపదోభవతు

తులసిని రోజూ పూజించటం ఎంతో మంచిది. ఈ మంత్రం చదువుతూ ఆ మొక్కలో ఒక గ్లాసు నీరు పోయండి.(ఆరోగ్యపరంగా కూడా చాలా మంచిది)

యాన్మూలే సర్వతీర్థానీ, యన్మధ్యే సర్వదేవతా:।
యదగ్రే సర్వవేదాశ్చ,తులసీం త్వాం నమామ్యహమ్॥
నమస్తులసీ,కళ్యాణీ, నమో విష్ణు ప్రియే శుభే
నమో మోక్షప్రదే । దేవీ నమ: సంపత్ప్రదాయినీ॥

### తీర్థం తీసుకునేటప్పుడు

అకామృత్యుహరణం, సర్వవ్యాధి నివారణం
సమస్త పాపక్షయకరం, శ్రీరామ పాదోదకం పావనం శుభం॥

### మనం ఎప్పుడూ ప్రార్థించవలసిన శ్లోకం

ఉగ్రవీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతో ముఖం।
నృసింహ భీషణం భద్రం మృత్యుమృత్యుం నమామ్యహం॥
మృత్యుం జయాయరుద్రాయ నీలకంఠాయ శంభవే।
అమృతేశాయ శర్వాయ శ్రీ మహాదేవతే నమ:॥
ఓం త్ర్యంబకం యజామహే సుగంధం పుష్టివర్ధనం
ఉర్వారుక మివబంధనాత్
మృత్యోర్ముక్షీయమామృతాత్॥

**పార్టు 5**

ఈ సృష్టిలో సూర్యుడు ఉదయించటం,అస్తమించటం ఎలాయితే సంభవిస్తోందో,సముద్రానికి అవతల ఒడ్డు,ఆకాశానికి హద్దులు లేనట్లు.అలాగే మానవుల యొక్క కోరికలుకు, ఆశలకు హద్దులు లేవని అందరికీ తెలుసు.అసలు ఈ జీవుడు శరీరాన్ని వదిలాక ఎటు వెళ్తుందో తెలియదు. మన పూర్వీకులందరూ (పెద్దవారు) ఈ కామ, క్రోధ,లోభాలు నరకానికి ద్వారాలని చెప్తూ ఉంటారు. అన్నీ తెలిసి అన్నీ అనుభవించాక కూడా ఇంకా ఇక్కడ ఏదో ఉండి పోయిందేమొ ఎలా వదిలి వెళ్ళాలి అనే ఆశ మనల్ని ఎటూ వెళ్ళలేని స్థితిలో ఉంచేస్తోంది.

నిజానికి ఈ ప్రపంచంలో మనిషికి మాత్రమే భవిష్యత్ గురించి,మృత్యువు గురించి తెలుసు.మృత్యువు సమీపించే సమయంలో ఉన్నా, ఏదీ మనతో రాదని తెలిసినా ఇంకా తనవారి కోసం ఏదో చేయాలనే తపన ఆఖరి ఊపిరి కూడా ప్రశాంతంగా వదిలే పరిస్థితి లేకుండా చేసుకుంటున్నాం.

ఇలా ఎందుకు జరుగుతోంది అంటే మానవుడు తనకు భగవంతుడు వరంగా ఇచ్చిన ఈ జీవితాన్ని ఎలా మలుచుకోవాలో తెలియని పరిస్థితిలో మనం ఉండటమే కారణం.

ముందుగా అసలు ఈ భూమి ఎలా పుట్టింది ? మానవులు ఎలా వచ్చారు. అనేది తెలుసుకుందాం!దాదాపు



నాలుగు బిలియన్ సంవత్సరాల క్రితం భూమి చాలా దారుణంగా ఉండేది. అప్పుడు ఈ భూమ్మీద ఆక్సిజన్ కూడా లేదుట. అప్పుడున్న సూక్ష్మజీవులికి ఆక్సిజన్ అవసరం ఉండేది కాదు.

# విజయవాడ మీదుగా 52 ప్రత్యేక రైళ్లు

**రా.వా ప్రతినిధి – విజయవాడ :** ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సంబల్‌పూర్ – బన్సవాడి వయా విజయవాడ మీదుగా 26 ప్రత్యేక రైళ్లు, సికింద్రాబాద్– గౌహతి వయా విజయవాడ మీదుగా 26 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నెంబర్ 08301గా జులై 5,12,19,26, ఆగష్టు 2,9,16, 23,30 సెప్టెంబర్ 6,13,20,27 తేదీల్లో (ప్రతి బుధవారం) సంబల్‌పూర్‌లో ఉదయం 9 :30 గంటలకు మరుసటి రోజు సాయంత్రం 4.40 గంటలకు బన్సవాడి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెంబర్ 08302గా జులై 7,14,21,28 ఆగష్టు 4,11,18,25 సెప్టెంబర్ 1,8,15,22,29 తేదీల్లో ( ప్రతి శుక్రవారం) బన్సవాడిలో అర్థరాత్రి 12.30 గంటలకు బయలుదేరి రెండవరోజు ఉదయం 06.35 గంటలకు సంబల్‌పూర్‌కు చేరుకుంటుంది. ఈ రైలు బర్‌గర్ రోడ్, బాలాంగిర్, టిట్లగర్, కేసింగ, రాయగడ, విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, గూడూరు, రేణిగుంట,కాట్‌పాడి, జోలార్‌పేట, కృష్ణరాజపురం స్టేషన్లలో ఆగుతుంది. సికింద్రాబాద్– గౌహతి వయా విజయవాడ మధ్య రైలు నెంబర్ 07149గా జులై 7,14,21,28 తేదీల్లో ఆగష్టు 4,11,18,25 తేదీల్లో సెప్టెంబర్ 1,8,15,22,29 తేదీల్లో (ప్రతి శుక్రవారం) సికింద్రాబాద్‌లో ఉదయం 7.30 గంటలకు బయలుదేరి ఆదివారం ఉదయం 8.45 గంటలకు గౌహతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెంబర్ 07150గా జులై 10,17,24,31 తేదీల్లో ఆగష్టు 7,14,21,28 తేదీల్లో సెప్టెంబర్ 4,11,18,25 తేదీల్లో, ఆక్టోబర్ 2 తేదీల్లో (ప్రతి సోమవారం) గౌహతిలో ఉదయం 5.25 గంటలకు బయలుదేరి విజయవాడ మీదుగా బుధవారం ఉదయం 9.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందని వివరించారు. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, సతైనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్, అందూల్, బర్ధమాన్, రాంపూర్ హట్, మల్దా టౌన్, బర్‌సోయ్, కిషన్‌గంజ్, న్యూజలపైగురి, జలపాయ్‌గురి రోడ్, మేనాగురి రోడ్, మతబంగా, న్యూ కోచ్‌బెర్, న్యూఅలిపుర్ధార్, కోక్‌రాజ్‌హర్ న్యూ బోంగైగన్, గోల్‌పర టౌన్, కామైక్య స్టేషన్లలో ఆగుతుందని పేర్కొన్నారు.

# జీఎస్టీ అలవాటుకు ఆర్నెల్లు

## ఫ్యాప్సీ ప్రెసిడెంట్ రవీంద్ర మోడీ

**హైదరాబాద్ :** ఆదాయపు పన్ను దాఖలు చేసే విషయంలో వ్యాపార, వాణిజ్య సంస్థల పట్ల ప్రభుత్వం ఓ ఏడాదిపాటు ఉదాసీనంగా ఉండాలని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) అభిప్రాయపడింది. తొలిసారిగా జీఎస్‌టీని అమలు చేస్తుండడమే ఇందుకు కారణమని ఫ్యాప్సీ ప్రెసిడెంట్ రవీంద్ర మోదీ వ్యాఖ్యానించారు. పన్ను వివిధ శ్లాబుల్లో ఉన్నందున వన్ నేషన్–వన్ ట్యాక్స్‌కు బదులుగా వన్ కమోడిటీ–వన్ ట్యాక్స్ అని పిలవాలన్నారు. జీఎస్‌టీని అర్థం చేసుకోవడానికి వ్యాపారులకు కనీసం ఆరు నెలలైన సమయం పడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. 'ఎన్నో అంశాలు గందరగోళానికి గురిచేస్తున్నాయి. కొందరు ప్రభుత్వ అధికారులకే వీటిపై స్పష్టత లేదు. జీఎస్‌టీ అమలు చేయటమనేది భారత దేశ చరిత్రలో చారిత్రక ఘట్టం. స్వాతంత్ర్యం అనంతరం తీసుకున్న సాహసోపేత సంస్కరణల్లో ఇదొకటి. కాకపోతే కొన్ని అంశాల్లో స్పష్టత అవసరం. జీఎస్‌టీ అమలైతేనే వీటిని అర్థం చేసుకోగలం. చాలా మంది వర్తకులు, సేవలందించే వారు పన్ను పరిధిలోకి కొత్తగా వస్తున్నారు. వన్నులు, ఆదాయపు పన్ను దాఖలు గురించి అవగాహనకు వీరికి కొంత సమయం పడుతుంది. కాబట్టి చిన్న వర్తకులు నూతన వ్యవస్థను అర్థం చేసుకునే వరకు ప్రభుత్వం ఏడాదిపాటు ఉదాసీనంగా వ్యవహరించాలి' అన్నారు. ఉదాహరణకు స్వీట్లు 5 శాతం కన్ఫెక్షనరీ 18 పన్ను పరిధిలో ఉన్నాయి. అయితే కొన్ని ఉద్పాదనలు ఏ విభాగం కిందకు వస్తాయోననే సంశయం ఉందన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి : జేసీ



**రా.వా ప్రతినిధి కోనసీమ –జీఎన్.రావ్ :** అన్ని గ్రామ పంచాయితీలలోను, పురపాలకసంఘ పరిధిలోను సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. అమలాపురం డివిజన్‌లోని వివిధ మండలాల్లో పర్యటించి పంచాయితీల్లోను, మండల ప్రధాన కేంద్రాల్లోను చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఋతుపవనాలు ప్రవేశించిన సందర్భంగా వర్షాలు అధికమై సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు వీటి బారిన పడకుండా ఉండేందుకు కలెక్టర్ ఆదేశాలతో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతోందని ఇందులో భాగంగా అన్ని గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీల్లో డ్రైయిన్లను శుభ్రపరచడం, క్లోరినేషన్‌చేసి పరిశుభ్రమైన త్రాగునీటిని ప్రజలకు అందించడం, జనావాసాల మధ్య నీటి కుంటలను తొలగించి బ్లీచింగ్ చేయడం వంటి కార్యక్రమాలను ముమ్మరం చేయడం జరిగిందని, ఇప్పటికే అధికారులంతా దీనిపై ఆదేశాలు జారీచేయడం జరిగిందని జేసీ తెలియజేశారు.

# రాష్ట్రంలో రూ.240 కోట్లతో గిడ్డంగుల నిర్మాణం

## స్టేట్‌వేర్ హౌసింగ్ కార్పోరేషన్ డైరక్టర్ రమణబాబు



**రా.వా ప్రతినిధి కోనసీమ–జీఎన్.రావ్ :** రాష్ట్రంలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్టేట్‌వేర్ హౌసింగ్ కార్పోరేషన్ ద్వారా రూ.240 కోట్లతో 4లక్షల మెట్రిక్ టన్నుల సామర్ధ్యం గల గిడ్డంగులను తక్షణం నిర్మించేందుకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని స్టేట్‌వేర్ హౌసింగ్ కార్పోరేషన్ డైరక్టర్ మెట్ల రమణబాబు తెలియజేశారు. స్టేట్‌వేర్ హౌసింగ్ కార్పోరేషన్ డైరక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారిగా రమణబాబు అమలాపురంలోని తన నివాసంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రమణబాబు మాట్లాడుతూ రూ.240కోట్ల ఖర్చుతో నిర్మించే గిడ్డంగులకు సంబంధించి నాబార్డుకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వడం జరిగిందని, ఈ గిడ్డంగులను రైతులకు అనువుగా ఉండే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతంలోనే నిర్మించడం జరగుతుందన్నారు. తక్షణం రూ.120కోట్లతో కొన్ని గిడ్డంగులను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వీటిలో పసుపు, మిర్చి నిల్వ చేసేందుకు గాను 26వేల మెట్రిక్ టన్నుల సామర్ధ్యంతో నాలుగు యూనిట్లుగా గుంటూరులో స్పైసస్ పార్కు పేరుతో శీతల గిడ్డంగులను నిర్మించనున్నారని, అలాగే విశాఖలో 12ఎకరాలను లీజుకు తీసుకుని ఆక్వా కోల్డ్ స్టోరేజ్‌ను వేర్ హౌసింగ్ కార్పోరేషన్ ద్వారా నిర్మించనున్నారని రమణబాబు తెలిపారు.

# స్పేస్ క్లబ్‌లో ఆస్ట్రాయిడ్ డే..

**రా.వా. ప్రతినిధి– గుంటూరు :** ఆస్ట్రాయిడ్ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక స్పేస్ క్లబ్ ఆఫ్ విజయ ఎడ్యుకేషనల్ సంస్థ కార్యాలయంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జి. శాంతిమూర్తి మాట్లాడుతూ 1908 జూన్ 30వ తేదిన ఒక చిన్న గ్రహశకలం సైబీరియాలోని తుంగుస్కా ప్రాంతాన్ని ఢీకొందని, దీనివలన 2000 చదరపు కిలోమీటర్ల భూభాగం నాశనమైందని చెప్పారు. అప్పటి నుంచి ఆస్ట్రోయిడ్ డేను జరుపుకుంటున్నారన్నారు. ఇప్పుడు ఆ స్థాయిలో గ్రహశకలం ఏదైనా భూమిని ఢీకొడితే ఒక పెద్ద నగరం నాశనమౌతుందని చెప్పారు. శాస్త్రవేతలు ఇప్పటి వరకు భూమి సమీపంలో హాని కలిగించే 1800 ఆస్ట్రాయిడ్స్‌ను గుర్తించారన్నారు. అంతర్జాతీయ ఖగోళ సంఘం ఒక గ్రహశకలానికి ఇండియాకు చెందిన ఖగోళ శాస్త్రవేత్త గుణేశ్వర్ తంగ్‌జామ్ పేరు పెట్టారని చెప్పారు. ఈ శాస్త్రవేత్త ప్రస్తుతం జర్మనీలో అంతర్జాతీయ ఖగోళ సంఘంలో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# నమ్మక ద్రోహానికి బలైన టీపూ సుల్తాన్

## టీపూ సుల్తాన్ (1750-1799)

ఉత్తర భారతాన్ని హస్తగతం చేసుకున్న ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు, దక్షిణ భారతాన్ని ఆక్రమించుకోవటానికి కుట్రలు, కుయుక్తులు పన్నుతున్న సందర్భంగా సామ్రాజ్య వాద శక్తుల రాజ్యవిస్తరణ కాంక్షను బహిర్గతం చేస్తూ స్వదేశీయులను ఏకం కమ్మని పిలుపునిచ్చిన దార్శనికుడు, 'మైసూరు పులి'గా ఖ్యాతిగాంచిన టిపూ సుల్తాన్ 1750 నవంబర్ 10న కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా దేవనహళ్ళి గ్రామంలో జన్మించారు. దక్షిణ భారతదేశ నెపోలియన్'గా ఖ్యాతి గడించిన హైదర్ అలీ ఆయన తండ్రి. ఆయన తల్లి పేరు ఫాతిమా ఫఖ్రున్నిసా. చిన్నతనంలోనే యుద్ధకళను ఔపోసన పట్టిన టిపూ సుల్తాన్ తండ్రితోపాటుగా పలు యుద్ధాలలో పాల్గొంటూ వచ్చారు. తండ్రి మార్గదర్శకత్వంలో ఆయన అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించారు. 1782లో తండ్రి హైదర్ అలీ కన్నుమూయగా టిపూ మైసూరు రాజ్యలక్ష్మిని చేబట్టారు. ఆ రోజున టిపూ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, 'మిమ్మల్ని వ్యతిరేకించినట్టయితే నేను నా స్వర్గాన్నీ, నా జీవితాన్ని, నా సంతోషాన్ని కోల్పోతాను. ప్రజల సంతోషం లోనే నా సంతోషం. నా ప్రజల సంక్షేమం లోనే నా సంక్షేమం ఇమిడి ఉంది. నాకిష్టమైందల్లా మంచిదని నేను భావించను. నా ప్రజలకు ఏది ఇష్టమో దానిని నా అభీష్టంగా భావిస్తాను, నాప్రజలకు ఎవరు శత్రువులో వారు నాకూ శత్రువులు. నా ప్రజలతో ఎవరు



కలహిస్తారో, వారు నాతో యుద్ధం ప్రకటించినట్లే' అని ప్రకటించి చివరివరకు ఆ మాటను పాటించారు. ఒకవైపు నిజాం నవాబు, మారాఠాలను మరోవైపు ఆంగ్లేయులను నిత్యం ఎదుర్కొంటూ 17 సంవత్సరాల పాటు ఆయన పాలన సాగింది. టీపూ సుల్తాన్ తన రాజ్యాన్ని ఉత్తరాన కృష్ణానది నుంచి, దక్షిణాన దిండిగల్ వరకు అంటే సుమారు 400 మైళ్ళ పొడవున, పశ్చిమాన మలబారు నుంచి, తూర్పున తూర్పు కనుమల వరకు సుమారు 300 మైళ్ళు విస్తరింప చేశారు. ఆధునిక వ్యాపార, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను ఆయన బహుధా ప్రోత్సహించారు. చిన్న చిన్న నేరాలను చేసినవారిని సంఘ ప్రయోజనాలకు పనికొచ్చేలా వినూత్న శిక్షలు విధించారు. కన్నడ, తెలుగు, మరాఠి, అరబ్బి, పర్షియన్, ఉర్దూ, ఫ్రెంచ్ భాషలను నేర్చుకున్న ఆయన విద్యావ్యాప్తి కోసం అవిరళ కృషి చేశారు. రాజ్యపాలనా వ్యవహారాలలో టిపూ సుల్తాన్ మతాతీతంగా వ్యవహరించారు. మసీదు–మందిరాల మధ్య గాని, హిందూ– ముస్లింల మధ్యగాని ఏమాత్రం తేడా చూపించ లేదు. టిపూ ఔన్నత్యాన్ని చూసి అసూయా ద్వేషాలతో రగిలిపోతున్న నిజాం నవాబు, మరాఠాలు టీపూకు వ్యతిరేకంగా ఏకం కావటమే కాక ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులతో చేతులు కలిపారు. అంతా కలసి మూకుమ్మడిగా భారీ బలగాలతో 1799 మే 4న ఉదయం టీపూ రాజధాని శ్రీరంగపట్నం మీద దాడి చేశారు. ఆ నిర్ణయాత్మక నాల్గవ మైసూరు యుద్ధంలో టిపూ సుల్తాన్ దివాన్ అయనటువంటి మిర్ సాదిక్ తదితరుల నమ్మకద్రోహం వలన పరాజయాన్ని ఎదుర్కొన్నారు. చివరి వరకు శత్రువుతో పోరాడుతూ టీపూ సుల్తాన్ 1799 మే 4న యుద్ధభూమిలో కన్నుమూశారు.

(ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు ఆల్బమ్ 'చరితార్థులు' నుంచి....)




Syed Naseer Ahamed
Mobile: 9440241727.
E-mail: naseerahamedsyed@gmail.com


# మన కోసం

| | | | | |
|---|---|---|---|---|
| | శ్రీ విజయలక్ష్మీ జనరల్ స్టోర్స్ | తుళ్ళూరు | చందోలు సత్యనారాయణ | 9441411432 |
| రెస్టారెంట్స్ | బిర్యానిస్ | విజయవాడ | బిర్యానిస్ | 7032202222 |
| | స్వాగత్ మెస్(వెజ్) | మల్కాపురం | చిగురుపాటి | 90329 58580 |
| | ఎస్.ఆర్.కె. గ్రాండ్ | మందడం | శ్రీనివాస్ | 9553023388 |
| షాప్స్ | రేమాండ్స్టైలర్స్ | తుళ్ళూరు | ఎస్.కె. జాని | 9492470426 |
| | వర్షిత ఫోటోస్టాట్ | రాయపూడి | పోతురాజు | 9985853188 |
| | బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్ | రాయపూడి | షేక్. మజీదు | 7095880828 |
| | కె.జి .ఎన్. కారు ట్రావెల్స్ | రాయపూడి | ఎస్.కె.సుబాని | 97040 74820, |
| | వైభవ్ డ్రస్సెస్ | తుళ్ళూరు | ఎస్వి. పున్నారావు | 9848407935 |
| | చైతన్య గోదావరి బ్యాంకు | రాయపూడి | | 08645244266 |
| | ఉంగరాల హుస్సేన్ టెంట్హౌస్ | రాయపూడి | ఉంగరాలఖాజ | 9441275466 |
| | అంజుమన్ టెంట్ హౌస్ | రాయపూడి | పఠాన్ బాషా ఖాన్ | 9502085516 |
| ట్రేడర్స్ | సాయి గణేష్ | వెలగపూడి | జొన్నలగడ్డ మనోజ్ కుమార్ | 7382371111 |
| | శ్రీ చంద్రిక | రాయపూడి | కోలా శ్రీనివాసరావు | 908073516 |


# అమరావతికి 'ఎన్నార్టీ'

## రూ.400 కోట్ల వ్యయంతో 30 అంతస్తులుగా నిర్మాణం

**రా.వా.ప్రతినిధి– అమరావతి :** ఏపీ అభివృద్ధి కోసం ప్రవాసాంధ్రులు ఏర్పాటు చేసిన నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఎన్ఆర్టీ) అమరావతి రాజధానిలో అద్భుత కట్టడాన్ని నిర్మిచబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం పరిపాలనా నగరానికి ఎంపిక చేసిన ప్రదేశానికి కూతవేటు దూరంలో దీనిని నిర్మించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 10 ఎకరాలు కేటాయించనుండగా సుమారు రూ.400 కోట్ల అంచనా వ్యయంతో 30 అంతస్తులతో ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా అపూర్వ కట్టడంగా నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. భవన నిర్మాణం కోసం కొరియా ఆర్కిటెక్చర్లు డిజైన్లు రూపొందించగా వాటిలో అమరావతి రాజధానికి సింబాలిక్గా 'ఏ' ఆకారంలో డిజైన్ను సీఎం చంద్రబాబు ఆమోదించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 93 దేశాల్లో 270 తెలుగు సంఘాలున్నాయి. సమీకరించి రాష్ట్రభివృద్ధికి ఉపయోగించుకోవడంతోపాటు, వారి అభివృద్ధికి కూడా సహకరించాలన్నది తమ లక్ష్యమని ఎన్ఆర్టీ చైర్మన్ డాక్టర్ వేమూరి రవికుమార్ చెప్పారు. ఇందుకోసం అమరావతిలో తాము నిర్మించే ప్లాటినం రేటెడ్ గ్రీన్ బిల్డింగ్ దోహదపడుతుందని తెలిపారు దాదాపు 9 లక్షల చదరపు అడుగుల్లో ఈ భవన్ నిర్మితమవుతుందన్నారు. ప్రపంచంలోనే ఉత్తమ నిర్మాణసంస్థలుగా ఎంపికైన సింగపూర్ వారిచే దీని నిర్మాణం చేపడతామని, ప్రభుత్వంతో నిమిత్తం లేకుండా దీని ఖర్చు మొత్తం ఎన్ఆర్ఐలు భరించడం విశేషంగా ఆయన పేర్కొన్నారు.

# జీఎస్టీ భవనం పైకప్పు లీకవుతోంది..

**ముంబై:** సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉండి అతి పెద్ద ఆర్థిక సంస్కరణగా భావిస్తున్న జీఎస్టీ (వస్తువులు, సేవల పన్ను) శుక్రవారం అర్థరాత్రి దాటిన క్షణం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ రోజును విజయవంతం చేయడం కోసం ముంబైలోని కస్టమ్స్, ఎక్సైజ్ విభాగాలకు చెందిన ఆడిట్ వింగ్లోని దాదాపు 500 మంది ఉద్యోగులు (వీరిని ఇక నుంచి జీఎస్టీ ఉద్యోగులు అని పిలుస్తారు) రేయింబవళ్లు కష్టపడ్డారు. మరో విధంగా చెప్పాలంటే రేయింబవళ్లు భయాందోళనలతో విధులు నిర్వర్తించారు. జీఎస్టీపై దేశవ్యాప్తంగా భయాందోళనలు నెలకొన్న నేపథ్యంలో దీన్ని అమలు చేయడంలో తామెలా నెట్టుకొస్తామని వారు ఆందోళన చెందలేదు. భవన పెచ్చులుగా ఊడుతూ, నీటి ధారలను కురిపిస్తున్న భవనం పైకప్పు ఎప్పుడు నెత్తిన కుప్పకూలుతుందోనన్నదే వారి భయాందోళన. వారం క్రితమే సర్వీస్ టాక్స్ విభాగానికి చెందిన డిప్యూటీ కమిషనర్ రోహిత్ సింగ్లా అలాంటి అనుభవాన్ని ఎదుర్కొన్నారు. ఇటీవల ఆయన తన ఆఫీసు గదిలో కంప్యూటర్పై పనిచేసుకుంటుండగా హఠాత్తుగా భవనం పైకప్పు నుంచి పెద్ద పెచ్చు ఊడి దభేల్మంటూ ఆయనకు ఆరు అడుగుల దూరంలో కూలింది. అదే రోజు అదే ధారవి ఆఫీసు భవనంలోని సమావేశ మందిరం పైకప్పు పూర్తిగా నేల కూలింది. మరో రోజు ఓ ఉద్యోగి నెత్తిన పెచ్చు కూలడంతో అతను స్వల్పంగా గాయపడ్డారు. అసలు ఆ భవనానికి ఓ పక్కన విద్యుత్ సౌకర్యం కూడా లేదు. ఈ ఇబ్బందులు చాలవన్నట్లు వర్షం కురిసిన రోజు కప్పు లీకుల్లో నుంచి నీరు ధారలుగా కారుతుంది. షార్ట్ సర్క్యూట్ ఏర్పడుతుందేమోనన్న భయంతో గత రెండు రోజులగా తాను ఆ వైపున్న కంప్యూటర్పై పనిచేయలేదని ఓ అధికారి వెల్లడించారు. తలచుకుంటే నవ్వొస్తుందిగని కొంత మంది అధికారులు నీళు పడకుండా గొడుగులు పట్టుకొని కంప్యూటర్లపై పనిచేశారని ఆయన తెలిపారు. ఆఫీసు పరిస్థితులు భయానకంగాను, ప్రమాదకరంగా ఉన్నాయని సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శిశిర్ అగ్నిహోత్రి మీడియాకు తెలిపారు. ప్రతి వర్షాకాలంలో తాము ఇలాగే భయాందోళనలతో పనిచేయాల్సి వస్తోందని, డెస్కటాప్లు, కంప్యూటర్ మేషీన్లు, ఫ్యాక్స్ మేషీన్లు, కేబుళ్లను ప్లాస్టిక్ కవర్లతో రక్షించుకోవాల్సి వస్తోందని ఆయన వివరించారు.





గొడుగు పట్టుకుని పనిచేస్తున్న సిబ్బంది , (ఇన్సెట్లో) పైకప్పు పెచ్చులు కూలి ఉద్యోగికి రక్తం కారుతున్న దృశ్యం

# దోమల నివారణకు సలహాలు,సూచనలు



**రా.వా.ప్రతినిధి, తుళ్లూరు :** మూడు రోజులుగా వర్షాలు కురియడంతో అనేక ప్రాంతాల్లో నీరు నిల్చింది. ఆయా ప్రాంతాల్లో ఆరోగ్యశాఖ సిబ్బంది దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేసి, ఇంటి ఇంటికి తిరిగి మందులు పంపిణీ చేశారు. కాలనీలో సిమెంటు రోడ్లు వేసి డ్రైనేజి కాలువలు నిర్మిస్తే ఈ సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు, గ్రామ కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ గాదె వెంకటప్పయ్య, మెడికల్ సూపర్వైజర్ గంటా లక్ష్మీనారాయణరావు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మిస్ ఇండియా 2017గా మానుషి చిల్లర్



**ముంబై:** ఫెమినా మిస్ ఇండియా 2017 కిరీటాన్ని హరియాణాకు చెందిన మానుషి చిల్లర్ కైవసం చేసుకుంది. ముంబైలోని యశ్రాజ్ ఫిల్మ్ స్టూడియోలో ఆదివారం రాత్రి జరిగిన పోటీలో విజేతగా నిలిచి మిస్ ఇండియా టైటిల్ గెలుచుకున్నారు. మొత్తం 30 మంది పోటీ పడగా.. టాప్ 6లో మానుషి చిల్లర్, షెఫాలీ సూద్, సనా దువా, ప్రియాంక కుమారి, ఐశ్వర్య దేవన్, అనుక్రితి గుసైన్లు నిలిచారు. మిస్ ఇండియాగా మానుషి, మొదటి రన్నరప్గా సనా దువా(జమ్మూ కశ్మీర్), రెండో రన్నరప్గా ప్రియాంకా కుమారి(బిహార్) ఎంపికయ్యారు. బాలీవుడ్ నటులు అర్జున్ రాంపాల్, ఇలియానా, బిపాసా బసు, అభిషేక్ కపూర్, విద్యుత్ జమాల్, ఫ్యాషన్ డిజైనర్ మనీశ్ మల్హోత్రలు న్యాయమూర్తులుగా వ్యవహరించారు. ఢిల్లీలోని సెయింట్ థామస్ స్కూల్, సోనెపట్లోని ఉమెన్స్ మెడికల్ కాలేజీలో మానుషి విద్యాభ్యాసం కొనసాగింది. ఆమె తల్లిదండ్రులిద్దరూ వైద్యులే.




శ్రీ కల్కి అందరివారు
విశ్వశాంతి ధర్మ స్థాపకులు,దైవ సత్యస్వరూపి,
ఎం.బేగ్
లోక రక్షకులు జగద్గురువులు శ్రీ కల్కి
కలియుగ కాల ప్రమాణము 4,32000 సంవత్సరాలు
3658 వ సం॥క్రీ॥ శ॥ 570 సం॥లో వచ్చారు. శ్రీ కల్కి
అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారు
కలియుగము మహా మంత్రమునకు సామ వేదములో
హో హో 1 లా ఇలాహ
హూ హూ 2 ఇల్లల్లాహు
హీ హీ 3 మొహమ్మదుర్ రసూలుల్లాహి
8143307812
ఎవరూ నరకానికి పోకుండా స్వర్గానికి వెళ్లాలనే ఆకాంక్షిస్తూ..

# కుటుంబ బంధాలు మంటగలుస్తున్నాయి...



మంచితనం, మానవత్వం మూర్తీభవించిన పాత్రల్లో హీరోల్లా ఒదిగిపోతారు. ఇదంతా నిజమని నమ్మిన పిచ్చి జనం అభిమాన సంఘాలు ఏర్పాటు చేస్తుంటారు. వారు నటించే సినిమాల్లో కుంటుంబాల కోసం ఎంతో త్యాగాలు చేస్తుంటారు.. సమాజం నుంచి ఎన్ని ఒత్తిడులు ఎదురైనా మంచితనాన్ని మాత్రమే అందిస్తారు కాని, నిజజీవితంలో మాత్రం అంతా వ్యతిరేకంగా ఉండటం ప్రజలను విస్తుబోయేలా చేస్తోంది. రవితేజ సోదరుడు భరత్ మృతితో అతని నిజ స్వరూపం బయట పడింది. యాక్సిడెంటు ప్రాంతం నుంచి ఉస్మానియాకు, ఉస్మానియా నుంచి నేరుగా స్మశానానికి తీసుకు వెళ్లటమే కాకుండా కుటుంబ సభ్యులు ఎవరూ చూడటానికి రాకపోవడంతో సినిమా ప్రేమికులు జీర్ణించుకోలేకపోతున్నారు. అంతేకాదు జూనియర్ ఆర్టిస్టుకు కేవలం రూ. 1500 ఇచ్చి ఖర్మకాండలు జరిపించడంతో పరిశ్రమ వర్గాలు, ప్రజలు అవాక్కయ్యారు. అదేమంటే చావునువారు జీర్ణించుకోలేక పోతున్నామన్నారు. బాబూ మోహన్, కోటాశ్రీనివాసరావు లాంటి వారు మాత్రం ఇప్పటికీ వారి కుమారుల గురించి ఎంతో వ్యధ చెందుతుండటం మనం చూస్తూనే ఉంటాం. అంత మాత్రం చేత వారు చివరి కార్యక్రమాల నుంచి వారు తప్పించు కోలేదుకదా.. ఎంతో మంది అనాధ శవాలకు అంతిమ సంస్కారాలు చేసి మానవత్వాన్ని నిరూపించుకుంటుంటే .. అందరూ ఉండి కూడా భరత్ అంతనికృష్టంగా అంత్యక్రియలు జరగడం చూపరులను కలచి వేసింది. టెర్రరిస్టు కంటే దారుణంగా వ్యవహరించారిని నెటిజన్లు వాపోయారు.

ఈ విషయంపై చిరంజీవి కూడా రవితేజను మందలించారు.అయినా రవితేజ పాషాణహృదయం కరగలేదు.. పవన్‌కల్యాణ్ ఫోన్ చేసి కుటుంబం తర్వాతే ఏ పని అయినా అని చెప్పారు.. ఫలితంలేదు.. జూనియర్ ఎన్టీఆర్ ఫోన్ చేసి ఎన్ని బాధలున్నా చేయవలసిన కార్యాలను దగ్గరుండి జరిపించండంటూ చెప్పినా వినలేదు. ఎలాంటివాడైనా కొడుకు కొడుకే కదా.. ఆ మాతృ హృదయం పేగుకూడా కదిలించకపోవడం పాశాణాన్ని తలపించింది.

ప్రముఖ దర్శకుడు దాసరి నారాయణరావు మృతిచెందినప్పుడు కూడా తరతరాలుగా సినిమా రంగాన్ని ఏలుతున్న ఒక కుటుంబం కడసారి చూడటానికి కూడా రాలేదు. పరిశ్రమలోని వారంతా ఎందుకిలా జరిగిందని ఆరా తీస్తే దాసరి 'కంటే కూతుర్నే కను' సినిమాకోసం సదరు స్టుడియోకి కొంత బాకీ పడ్డారట.. దాంతో వారు ఆయన్ను చూడటానికి కూడా రాలేదట.. ఇదండీ మన హీరోల పరిస్థితి.. అయితే సదరు తండ్రీకొడుకులకు కేరీర్ పడిపోతున్నప్పుడు ఆదుకున్నది దాసరేనని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ఇలాంటి వారు సినిమా రంగంలో చాలా మంది ఉన్నారు. జీవితం ఒక రంగస్థలం అనుకుంటే ఎవరి పాత్ర అయిపోతే వారు ఈలోకం అనే స్టేజి దిగిపోవాల్సిందే .. దాంట్లో సందేహం లేదు.. ఈ మాత్రం దానికే పగలూ ప్రతీకారాలు, డబ్బుపై విపరీతమైన వ్యామోహాలు... మనం చచ్చిన తర్వాత కూడా చెప్పుకోవడానికి ఒక్క మంచి పని కూడా లేకపోవడం, బ్రతికున్నప్పుడు ఏం చేశాడు అనిపించుకోవడం కంటే చెత్త జీవితం ఇంకా ఏముంటుంది ?

– ఖాన్

## అటార్నీ జనరల్‌గా వేణుగోపాల్

**న్యూఢిల్లీ :** భారత కొత్త అటార్నీ జనరల్‌గా సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ కేకే వేణుగోపాల్ పేరు ఖరారైంది. ఇంతకు ముందు ఆ పదవిలో ఉన్న ముకుల్ రోహత్గి రాజీనామాతో కొత్త అటార్నీ జనరల్ నియమకం తప్పనిసరైంది. అమెరికా, పోర్చుగల్, నెదర్లాండ్స్ పర్యటనకు ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనకు ముందు 86 ఏళ్ల వేణుగోపాల్ నియామకంపై చర్చించారు. మూడు దేశాల పర్యటనకు బయలుదేరి వెళ్లే ముందు ప్రధానితో వేణుగోపాల్ సమావేశమయ్యారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే, ఈ అంశంపై నోటిఫికేషన్ వచ్చేవరకు తాను మాట్లాడనని వేణుగోపాల్ చెప్పారు.

## పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలి

**రా.వా ప్రతినిధి, తుళ్ళూరు :** మండలంలోని 10 నెలల నుంచి 15 ఏళ్ళ పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేయనున్నట్లు తుళ్ళూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రమాదేవి తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఇంటికి, పాఠశాలలకు తిరిగి బాల బాలికలలకు వ్యాక్సిన్‌లు వేయాలని సూచించారు.తట్టు వ్యాధుల నివారణకు మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలని కోరారు. సిబ్బందికి వ్యాక్సిన్ వినియోగంపై కూడా శిక్షణ ఇచ్చినట్లు రమాదేవి తెలిపారు.

# నంద్యాలలో టీడీపీ వర్సెస్ వైసీపీ

**ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే వేడేక్కిన రాజకీయాలు**



**రా.వా ప్రతినిధి అమరావతి :** నంద్యాల ఉప ఎన్నికలను రెండుపార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో రాజకీయాలు వేడెక్కాయి. ఉపఎన్నిక ఫలితాలు ఏవిధంగా ఉంటాయనేది హాట్ టాపిక్‌గా మారింది. ఏ ఇద్దరు నాయకులు కల్సినా దాని గురించే ఆసక్తికరంగా చర్చలు సాగుతున్నాయి. ప్రధానంగా నంద్యాల నియోజకవర్గానికి సంబంధించి పార్టీల నేతలు గత ఎన్నికకు, ఇప్పటికీ తారుమారు కావడం ఆసక్తి రేపుతోంది. 2014 ఎన్నికల్లో ఇక్కడ నుండి పోటీచేసిన టీడీపీ అభ్యర్థి శిల్పాహనరెడ్డి వైసీపీ అభ్యర్థి భూమా నాగిరెడ్డి విజయం సాధించారు. తదనంతరం భూమా టీడీపీలో చేరడం, ఇటీవల మృతి చెందడంతో ఆయన కుమారై అఖిలప్రియకు సీఎం చంద్రబాబు మంత్రి పదవి ఇచ్చిన విషయం తెల్సిందే. సంప్రదాయం ప్రకారం ఉప ఎన్నికలో భూమా కుటుంబానికి చెందిన అభ్యర్థికే టిక్కెట్ ఇవ్వాలని అఖిలప్రియ పట్టుబట్టారు. అలా ఇస్తే గెలిపించే బాధ్యత తనదని చంద్రబాబుకి హామీ ఇచ్చారు. ఆమె సోదరుడైన బ్రహ్మానందరెడ్డికి టిక్కెట్‌ను సీఎం ఖరారు చేయగా, మనస్తాపానికి గురైన శిల్పా మోహనరెడ్డి వైసీపీ గూటికి చేరారు. దీంతో నంద్యాల రాజకీయం రసకందాయంలో పడింది. భూమా నాగిరెడ్డి మృతి చెంది మూడు నెలలు కావస్తోంది, ఆరు నెలల్లోపు ఎట్టిపరిస్థితుల్లో ఎన్నికలు నిర్వహించాలి. బ్రహ్మానందరెడ్డిని గెలిపించుకోలేకపోతే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని అఖిలప్రియ, తాను ఓడిపోతే రాజకీయాల నుండి శాశ్వతంగా వైదొలుగుతానని శిల్పా నవాల్ విసిరారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక శాసనసభాస్థానానికి జరిగే ఏకైక ఉపఎన్నిక కావడంతో దీనిని అధికారపార్టీ రెఫరెండంగా భావిస్తోంది. ప్రతిపక్షపార్టీ కూడా టీడీపీ ప్రభుత్వ ప్రజాదరణను ఏ విధంగా కోల్పోయిందో నిరూపించాలంటే ఇదే సదవకాశంగా పరిగణిస్తోంది. నంద్యాల ఎన్నికల్లో గెలిచిన పార్టీ 2019లో అధికారంలోకి వస్తుందని ఇరుపార్టీల అంచనా.

**నైతిక సమస్యలు**

నంద్యాల నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిమాణాలను గమనిస్తే విజయం ఇరుపార్టీలకు అంత తేలిక ఏం కాదనేది స్పష్టమవుతోంది. 2014 ఎన్నికల్లో వైసీపీ టిక్కెట్‌పై గెలిచిన భూమా నాగిరెడ్డి పార్టీ ఫిరాయించారు. ఆయనతోపాటు ఆళ్ళగడ్డ నుండి పోటీచేసిన కూతురు, ప్రస్తుత మంత్రి భూమా అఖిలప్రియ కూడా వైసీపీ నుండి గెల్చి తర్వాత పార్టీ మారారు. దీంతో భూమా కుటుంబానికి సహజంగా రావాల్సిన సానుభూతి ఓటింగ్ తగ్గనుంది. ఈ నియోజకవర్గంలో రెడ్లు, బలిజలు, ముస్లిం ఓటర్లు ఎక్కువ. వీరిలో రెడ్లు, ముస్లింలు అత్యధికంగా వైసీపీలో ఉన్నారు. టీడీపీ అభ్యర్థి రెడ్డి వర్గానికి చెందినవారైనా మెజార్టీ ఓటర్లు వైసీపీ వైపే మొగ్గుచూపుతున్నారు. అలాగే శిల్పా మోహనరెడ్డికి ఈ సారి టీడీపీ టిక్కెట్ ఇవ్వకపోవడం అన్యాయమన్న భావన టీడీపీ వర్గాల్లో ఉంది. వీరంతా శిల్పా పార్టీ మారినప్పటికీ సానుభూతిగా సహకరించే అవకాశం ఉంది. మరోప్రక్క భూమా అఖిలప్రియ ఒంటెత్తు పోకడలతో కుటుంబసభ్యులకే అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పార్టీ నాయకత్వాన్ని విస్మరిస్తోందన్న ఆరోపణలున్నాయి. ఇటీవల టీడీపీలో భూమా నాగిరెడ్డికి ముఖ్యశిషుడైన ఏవీ సుబ్బారెడ్డి వేరుకుంపటి పెట్టడం, ముఖ్యమంత్రి వెంటనే అప్రమత్తమై ఇరువర్గాలను కూర్చోబెట్టి సర్ధిచెప్పడమే ఇందుకు ఉదాహరణ. నంద్యాల ఎంపీ ఎస్పీవై రెడ్డి అల్లుడు శ్రీధర్‌రెడ్డికి టిక్కెట్ వస్తుందని ఆశించి భంగపడడం ఆయన అనుచరుల జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక మాజీమంత్రి ఫరూక్‌కు అఖిలప్రియ తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్న అసంతృప్తి ముస్లిం వర్గాల్లో నెలకొంది, అన్నింటికి మించి భూమా బ్రహ్మానందరెడ్డి నాన్‌లోకల్ కావడం టీడీపీకి కొంత మైనస్‌గా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక వైసీపీ విజయం అంత తేలికేం కాదని నేతలు విశ్లేషిస్తున్నారు. మొన్నటివరకు వైసీపీకి బద్ధశత్రువుగా ఉన్న శిల్పా మోహనరెడ్డి అభ్యర్థిత్వం పెద్ద మైనస్ అని వైసీపీ వర్గీయుల భావన. వైసీపీ టిక్కెట్ తనదేనని ప్రచారం చేసుకున్న ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజగోపాల్ రెడ్డి ఈ అకస్మాత్తు పరిమాణామంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.



# సినిమాలకు కష్టకాలం

- జీఎస్టీతో 28 శాతం పెరగనున్న వినోదపన్ను
- టికెట్ ధరలకు రెక్కలు

గుడ్డకోసం, గూడు కోసం ... జానెడు పొట్టకోసం ఎవరి తాహతుల్లో వారు పోరాడటం అనివార్యం. ఈ పోరాటంలో కాసేపు మర్చిపోదామనుకుంటే కేంద్ర ప్రభుత్వం ఆ ఆనందం కూడా మిగల్చలేదు. జీఎస్టీ విధింపుతో ఏ సెంటర్లలో టిక్కెట్టు ధర రూ.50 నుంచి రూ.120 దాకా పెరిగింది. టిక్కెట్టుతో పాటు తినుబండారాల ధరలు కూడా మోత మోగుతుండటంతో సామాన్య, మధ్యతరగతి జనం కుటుంబసమేతంగా సినిమాకు వెళ్లాలంటే హడలిపోతున్నారు.

పెద్ద సినిమాల రిలీజు రోజు మినహా మిగిలిన రోజుల్లో అంతంత మాత్రం కలెక్షన్లతో థియేటర్లు ఇబ్బందిపడుతున్న తరుణంలో జులై 1వ తేదీ నుంచి జీఎస్‌టీ అమలులోకి రాబోతోంది. దీని ప్రకారం ప్రస్తుతం 15 నుంచి 18 శాతం దాకా ఉన్న వినోదపు పన్ను ఏకంగా 28 శాతానికి పెరగనుంది. థియేటర్ యాజమాన్యాలు ఈ భారం ప్రేక్షకులపై వేసేందుకు సిద్ధమయ్యారు.


**టిక్కెట్టు ధరను బట్టి పన్ను విధింపు**

ఇప్పటివరకు డబ్బింగ్ సినిమాలకు 20 శాతం, తెలుగు సినిమాలకు 15 శాతం వినోదపు పన్ను వసూలు చేస్తున్నారు. కొత్తగా అమల్లోకి రానున్న జీఎస్టీ ప్రకారం రూ.100లోపు టిక్కెట్టు ధర ఉంటే 18 శాతం, రూ.100 పైన టిక్కెట్టు ధర ఉంటే 28 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ కారణంగా అన్ని సెంటర్లలో టిక్కెట్ల ధరలు పెరగడం అనివార్యమవుతుంది. జీఎస్‌టీ ద్వారా ఒక్కసారిగా 28శాతం దాకా పన్ను పెరగనుండటంతో థియేటర్ల యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి. టిక్కెట్ల ధరలు పెంచితే ప్రేక్షకుల సంఖ్య తగ్గి తమ వ్యాపారం దెబ్బతింటుందనీ, ధర పెంచకపోతే ఆ మేరకు తామే అదనపు భారం భరించాల్సి వస్తుందనీ ఆందోళన చెందుతున్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఈ భారం యాజమాన్యాలు భరించే పరిస్థితి లేదని వారు చెబుతున్నారు. మొత్తం మీద జీఎస్‌టీ పుణ్యమా అని సామాన్య, మధ్యతరగతి జనం సినిమా లాంటి చిన్న వినోదానికి కూడా దూరమయ్యే పరిస్థితులు ఏర్పడబోతున్నాయి.

## పేద ముస్లిం కుటుంబానికి ప్రకాష్‌రాజ్ రంజాన్ గిఫ్ట్




సినీ నటుడు ప్రకాష్ రాజ్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. కొండారెడ్డి పల్లిలో నివసించే చోటేమియా కుటుంబం కొన్నాళ్ల కిందటివరకూ శిథిలావస్థలో ఉన్న ఇంటిలో జీవించేది. ఆ ఊరినిదత్తత తీసుకున్న ప్రకాష్ రాజ్ వారిపరిస్థితిని తెలుసుకుని చలించిపోయాడు.వారికి సొంతింటిని కట్టిస్తానని హామీ ఇచ్చి,ఆ శిథిలావస్థలోని ఇంటిని పూర్తిగా కూల్చేయించి,తన డబ్బుతోచక్కటి ఇంటిని నిర్మించి ఇచ్చాడు. ఇటీవలే నిర్మాణం పూర్తి కాగా, రంజాన్ రోజున ఆ ఇంటిని ప్రారంభించారు. ఆ కార్యక్రమానికి ప్రకాష్‌రాజ్ హాజరై చోటేమియా కుటుంబానికి కొత్తింటి తాళాలను అందించి తన మంచితనాన్ని చాటుకున్నారు.






బందరు రోడ్డులో రంజాన్ పండుగ ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

# త్వరలో దోమల ఉత్పత్తి నివారణ చట్టం

**రా.వా.ప్రతినిధి- అమరావతి :** దోమల ఉత్పత్తి నివారణ చట్టంపై ఏపీ సచివాలయంలో మంత్రులు కామినేని శ్రీనివాస్,నారా లోకేష్,సమావేశం నిర్వహించారు. దోమల ఉత్పత్తి నివారణ చట్టం పై విధి విధానాలను నిర్ణయించి, కార్యాచరణ ప్రణాళిక సిద్దం చేసి తదుపరి క్యాబినేట్‌లో ఈ చట్టంపై చర్చిస్తారు. ఈ చట్టంపై ముగ్గురు సభ్యులతో కూడిన అప్పిలేట్ అధారిటీని నియమించాలని ఈ సమావేశంలో మంత్రులు నిర్ణయించారు. ప్రస్తుతం రాష్ట్రంలో దోమలపై దండయాత్రపై చేస్తున్న ప్రచారం లాగే దోమల ఉత్పత్తి నివారణ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేలా పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామాలు, పట్టణాలలో అపరిశుభ్రంగా నీరు నిల్వ ఉండటం, డ్రైయిన్స్ శుభ్రపరచకపోడం, కొబ్బరి బోండాలు తాగి పడేయడం, టైర్లు, ఎయిర్ కూలర్స్‌లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. దోమలు వ్యాప్తి టవల్ల వస్తున్న జ్వరాలు మలేరియా, డెంగ్యూ వ్యాధి ప్రభావిత ప్రాంతాలను గుర్తించేందుకు ప్రభుత్వ ఆసుపత్రిలో రోజు నమోదు అవుతున్న ఓపితో పాటు, ఈ ఔషది, స్వాస్థ్య విద్యావాహిని కార్యక్రమాల ద్వారా గ్రామాలలో, మున్సిపల్ వార్డులలో ఎక్కువగా నమోదు అవుతున్న రోగాలను గుర్తించవచ్చున్నారు. తద్వారా దోమల ఉత్పత్తిని నివారించవచ్చని మంత్రులు తెలిపారు.


# ట్రంప్ పక్కా వ్యాపారవేత్త



అమెరికా అధ్యక్షుల్లో అందరి కంటే భిన్నమైన వ్యక్తి ట్రంప్. ఆయన ఒక్కడే రాజకీయాల నేపథ్యంలో నుంచి కాకుండా వ్యాపారవేత్తల కుటుంబం నుంచి వచ్చారు. ఆయన పక్కా వ్యాపారవేత్త, అందులో సందేహంలేదు. ఆయనేదో మోడీని ఆలింగనం చేసుకొని ఎవ్వరికీ ఇవ్వనంత ప్రాముఖ్యం ఇచ్చారన్నది కేవలం మీడియా, రాజకీయవేత్తల ప్రచారం మాత్రమే.. ఆయన వ్యూహం వేరు. ప్రస్తుతం తమ వాణిజ్య లోటు పూడ్చుకోవడానికి భారత్ ఓ పావుగా మారబోతుందనే ఆనందంతోనే ట్రంప్ అలా వ్యవహరించారనండంలో సందేహం లేదు. ఈ పర్యటన వల్ల ప్రధాని మోడీ,భారత్‌కు ఒనగూర్చిన మేలు శూన్యం. వీరిద్దరి మధ్య టెర్రరిజం,రక్షణ సహకారం, వాణిజ్య సంబంధాల వృద్ధి వంటి అంశాలపై మాత్రమే చర్చలు జరిగాయి. భారత్ దృష్ట్యా అత్యంత ముఖ్యమైన మూడు అంశాలు అసలు అజెండాలోనే లేకుండా చేయడం ద్వారా ట్రంప్ ముందుగానే వ్యూహాత్మకంగా వ్యవహారించారు.ప్రజాస్వామిక ఆకాంక్షలు, దౌత్య సంబంధాలను మెరుగుపర్చు కోవడానికి ఇచ్చిపుచ్చుకొనే విధానాలు ఆయనకు అంతగా రుచించవు. వ్యాపార ప్రయోజనాలు, లాభనష్టాలే ఆయన ఆలోచనంతా. అమెరికన్ కంపెనీలకు భారత్ తన మార్కెట్లు మరింత తెరచి ఉంచేలా చేయడమే ఆయన లక్ష్యం. మోడీ సర్కారు జీఎస్టీ సహా పలు సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దు తున్నదని ప్రత్యేకంగా పేర్కొ నడం,భారత్‌ను అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ప్రశంసించడం, ఉభయదేశాలు కలసికట్టుగా ఎదుగుదామని పిలుపునివ్వడం వెనుక ఆయన ఉద్దేశమంతా అమెరికన్ కంపెనీలను పెట్టు బడులకు ప్రోత్సహించడమే. ఇప్పటికే అమెరికా నుంచి సహజవాయువు కొనుగోలుకు నిర్ణయించింది. అంటే కతార్, ఇరాన్ ధరల కన్నా ఎక్కువ పెట్టి ఈ సహజ వాయువును దిగుమతి చేసుకోనుంది. వంద విమానాలు కొనుగోలు చేయాలని కూడా భారత్ నిర్ణయించింది. అంటే కతార్, ఇరాన్ ధరల కన్నా ఎక్కువ పెట్టి ఈ సహజ వాయువును దిగుమతి చేసు కోనుంది. వందవిమానాలు కొనుగోలు చేయాలని కూడా భారత్ నిర్ణయించింది. ఈ ఆర్డరు ఇవ్వడంపై ట్రంప్ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ అమెరికాలో వేలాది ఉద్యోగాలను కాపాడే అతి పెద్ద ఆర్డర్ అని వ్యాఖ్యానించారు. మన రక్షణ రంగానికి ఒక అతిపెద్ద రవాణా విమానం,ఇరవై రెండు డ్రోన్ల విక్రయాన్ని కొద్దిరోజుల కిందటే అమెరికా ఆమోదించిన విషయం తెలిసిందే. పదేళ్ల కాలంలో అమెరికా నుంచి భారత్ 15 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధ సామాగ్రిని కొనుగోలు చేసింది. ఆయుధాల అమ్మకాలు కాదు, సాంకేతికతను అందించాలనే భారత్ అభ్యర్తనను ఇప్పటికి అది పట్టించు కోవడంలేదు,ఉభయ దేశాల మధ్య మైత్రి ఎలా ఉండాలనే అంశాన్ని ట్రంప్ నిర్మోహమాటంగా చెప్పారు.'మీ దేశంలో మా వాణిజ్య లోటును తగ్గించడం మాకు ముఖ్యం' అని ట్రంప్ చెప్పిన తర్వాత కూడా ఈ చర్యలు విజయవంతంగా ముగిశా యని ఏ భారతీయుడు భావించినా అంతకు మించి తెలివి తక్కువ తనం ఏముంది.. ఇండియాకు అమెరికా చేస్తున్న ఎగుమతుల వల్ల ఆ దేశంలో ప్రత్యక్షంగా,పరోక్షంగా రెండు లక్షల 60 వేల ఉద్యోగాల సృష్టి జరిగినట్లు 'ఫిక్కీ' నివేదిక వెల్లడించింది.

అమెరికా విదేశాంగ, రక్షణ కార్యదర్శులు ఏకపక్షంగా చర్చల అజెండాను నిర్ధారించడంతో మోడీ ఇతర విషయాలేవీ ప్రస్తావించలేకపోయారు. భారత్ సమాచార, సాంకేతిక పరిశ్రమకు ఆశనిపాతంగా పరిణమించిన హెచ్1బీ వీసాల ప్రస్తావనే రాలేదు. భారతీయ యువత ఎంతగానో ఆశించిన అంశం ఇది. దీనిపై అమెరికా నుంచి మాట మాత్రంగా అయినా హామీ రాలేదు. భారత్‌కు అనుకూలంగా ఉందని ఆరోపిస్తూ ఆయన పారిస్ ఒప్పందం నుంచి వైదొలిగారు. దానిని ప్రస్తావించ డానికి మోడీ ఏమాత్రం సాహసించలేదు. దీన్ని బట్టి చూస్తే అమెరికా పర్యటన నామమాత్రమేనని ఇందులో భారత్‌కు ఒనగూడిన ప్రయోజనాలు ఏమాత్రం లేవని దేశ ప్రజలు అర్ధం చేసుకోవాలి.

– బోస్







Printed by Pattan Hussain Khan, published by Pattan Hussain Khan on behalf of Vastitude media pvt ltd.and printed at Jagathi Publications Ltd.
D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. publised at Guntur. Editor: Pattan Hussain Khan,
Ph: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18